ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

మంగళవారం 11 మార్చి 2025



లోక్‌సభలో వాగ్యుద్ధం

- త్రిభాషా విద్యావిధానంపై నిరసన
- కేంద్రంపై డీఎంకే ఎంపీల విమర్శల వర్షం
- తమిళ సభ్యులపై నోరుజారిన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- కనిమొళి ఖండనతో వ్యాఖ్యల ఉపసంహరణ
- రాష్ట్రంలో పలుచోట్ల నిరసనలు



ధర్మేంద్ర ప్రధాన్, కనిమొళి

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని ఆమోదించేందుకు సిద్ధపడినా తమిళ ఎంపీలు అడ్డుకుని, అనాగరికంగా వ్యవహరిస్తూ విద్యార్థుల భవిష్యత్ నాశనం చేశారంటూ లోక్‌సభలో కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై డీఎంకే, కాంగ్రెస్ ఎంపీలు మండిపడ్డారు. సోమవారం ఉదయం ప్రారంభమైన వార్షిక బడ్జెట్ రెండో విడత పార్లమెంట్ సమావేశాల్లో త్రిభాషా విద్యావిధానాన్ని డీఎంకే, కాంగ్రెస్ ఎంపీలు తీవ్రంగా నిరసించారు. మంత్రి ధర్మేంద్ర తమిళ ఎంపీల మధ్య వాగ్వివాదం జరగడంతో లోక్‌సభ అట్టుడికిపోయింది. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే త్రిభాషా విద్యావిధానానికి, నిర్బంధ హిందీ అమలుకు దోహదం చేసే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో బలవంతంగా అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందంటూ డీఎంకే ఎంపీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తేనే విద్యాపరమైన నిధులు విడుదల చేస్తామంటూ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బెదిరించడం ఫెడరల్ రాజ్యాంగ విధానానికే వ్యతిరేకమని, రాష్ట్రంపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం తగదన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బదులిస్తూ.. పీఎంశ్రీ పథకం అమలుకు కేంద్రంతో తమిళనాడు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమైందని, ఒప్పందంపై సంతకం పెట్టేందుకు కూడా అంగీకరించి, ఆ తరువాత హఠాత్తుగా యూటర్న్ తీసుకుందన్నారు. దీంతో తమిళ విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలో పడేసిందని ఆరోపించారు. తమిళభాషను కుటిల రాజకీయాలకు వాడుకుంటున్నారని, బీజేపీయేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలు జాతీయ విద్యావిధానాన్ని అంగీకరించాయని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కూడా పీఎంశ్రీ పథకాన్ని ఆమోదించాయన్నారు. జాతీయ విద్యావిధానం ద్వారా హిందీని నిర్బంధంగా అమలు చేస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.. ఎంపీలు తమిళచ్చి సౌందరపాండ్యన్, కనిమొళి తనను కలిసి పీఎంశ్రీ పథకాన్ని అంగీకరిస్తామని హామీ కూడా ఇచ్చారని తెలిపారు. పీఎంశ్రీ పథకాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ అంగీకరించారని, ఆ తర్వాత ఏవరో సూపర్ సీఎం జోక్యంచేసుకోవడంతో ఆయన వెనక్కి తగ్గారన్నారు. గతేడాది మార్చి 15న పీఎంశ్రీ పథకాన్ని అంగీకరిస్తామంటూ ఒప్పందంలో సంతకం చేసిందన్నారు. ప్రస్తుతం ఆ పథకం ద్వారా అంతర్జాతీయ స్థాయి విద్యను తమిళ విద్యార్థులకు అందకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమిళ మంత్రితోపాటు వచ్చిన ఎంపీల బృందం కూడా తనను కలుసుకుని పీఎంశ్రీ పథకాన్ని అంగీకరిస్తామని ప్రకటించి, ఆ తర్వాత మాట మార్చారన్నారు. ఇలా అనాగరికంగా ప్రవర్తించడం భావ్యమేనా అని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఒక్కసారిగా డీఎంకే, కాంగ్రెస్ ఎంపీలంతా లేచి తమిళ ఎంపీలను అనాగరికులంటారా అని కేకలేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. పరిస్థితి చేయిదాటేలా వుండడంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదావేశారు.



చెన్నైలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న డీఎంకే నేతలు, కార్యకర్తలు

నోటి దురుసు తగదు: స్టాలిన్

లోక్‌సభలో తమిళ ఎంపీలను అనాగరికులంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ మండిపడ్డారు. ఈ మేరకు తన ఎక్స్ పేజీలో ఓ ప్రకటన విడుదల చేస్తూ 'రాష్ట్రానికి నిధులివ్వకుండా మోసగిస్తున్న మీరు మా తమిళ ఎంపీలను చూసి అనాగరికులని ఎలా అనగలిగారు?' అంటూ మంత్రిని నిలదీశారు. అనాగరికులని ఎంపీలను విమర్శించి తమిళ ప్రజలందరినీ అవమానించారని, ఈ అవమానానికి ప్రధాని మోదీ మద్దతు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. త్రిభాషా విద్యావిధానాన్ని ప్రోత్సహించే జాతీయ విద్యావిధానాన్ని పీఎంశ్రీ పథకాన్ని పూర్తిగా నిరాకరించామని మంత్రి తనకు లేఖ రాసిన విషయాన్ని కూడా మరచిపోయారన్నారు. విద్యానిధులను విడుదల చేస్తారా లేదా? అనే విషయంపై మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టమైన ప్రకటన చేయాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

కనిమొళి ఆగ్రహం..

సభ పునఃప్రారంభం కాగానే డీఎంకే సభాపక్ష నాయకురాలు కనిమొళి మాట్లాడుతూ విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తమిళ ఎంపీలను అనాగరికులంటూ విమర్శించి తమిళ ప్రజలందరినీ అవమానించారని, ఆ వ్యాఖ్యలు తమనెంతో బాధిస్తున్నాయన్నారు. త్రిభాషా విద్యావిధానాన్ని డీఎంకే ఎప్పుడూ అంగీకరించదని, సర్వశిక్షా అభియాన్ నిధుల విడుదల కోసమే మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలుసుకున్నానని వివరణ ఇచ్చారు. దీంతో తమిళ ఎంపీలను అనాగరికులంటూ తాను చేసిన విమర్శను ఉపసంహరించుకుంటున్నట్లు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. తమిళ ఎంపీలు సభలో హుందాగా నడచుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం తొలుత అంగీకరించిన పథకానికి ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు.

సభా హక్కుల ఉల్లంఘన నోటీసు..

పీఎంశ్రీ పథకాన్ని తమిళనాడు ప్రభుత్వం అంగీకరించేందుకు సిద్ధమైందంటూ సభకు తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపిస్తూ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై డీఎంకే ఎంపీ కనిమొళి సభా హక్కుల ఉల్లంఘన నోటీసును స్పీకర్‌కు అందజేశారు.

నగరంలో నిరసన ప్రదర్శనలు...

లోక్‌సభలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ డీఎంకే ఎంపీలను అనాగరికులంటూ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ నగరమంతా డీఎంకే శ్రేణులు సోమవారం మధ్యాహ్నం నిరసనలు జరిపాయి. ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం వద్ద ధర్మేంద్ర ప్రధాన్ ఫొటోలను చెప్పులతో కొడుతూ, కాలితో తొక్కుతూ తమ ఆక్రోశం వెళ్లగక్కాయి. మరికొందరకు కేంద్ర మంత్రి దిష్టిబొమ్మను కూడా దగ్ధం చేశారు. ఇదే విధంగా కొరుక్కుపేట తదితర ప్రాంతాల్లో డీఎంకే స్థానిక నాయకులు ధర్నా, రాస్తారోకో జరిపారు. తిరుచ్చి, సేలం, కోయంబత్తూరు నగరాలలోనూ డీఎంకే, దాని మిత్రపక్షాలు కలిసి ధర్నా నిర్వహించాయి.



ధర్మేంద్ర ప్రధాన్ ఫొటోలను చెప్పుతో కొడుతున్న మహిళా కార్యకర్తలు

నేత్రపర్వంగా వడివుడైయమ్మన్ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

ప్యారీస్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై తిరువొత్తియూర్ నియోజకవర్గంలో ప్రసిద్ధిచెందిన త్యాగరాజస్వామి సమేత వడివుడై అమ్మన్ ఆలయ రథోత్సవం సోమవారం కోలాహలంగా జరిగింది. ఈ వైభవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. పురాతనమైనదిగా గుర్తింపు పొందిన ఈ ఆలయంలో ప్రస్తుతం మాసి మాస బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన రథోత్సవాని ఆలయ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. డీఎంకే ఎమ్మెల్యేలు మాధవరం సుదర్శనం, కేపీ శంకర్, కౌన్సిలర్ డాక్టర్ కార్తిక్ ముఖ్యఅతిథులుగా హాజరై, రథంపూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన ప్రవేశద్వారం నుంచి భక్తుల దివ్యనామస్మరణ, వేదపండితుల మంత్రోచ్ఛారణ, మంగళవాయిద్యాల నడుమ కదిలిన రథం పురవీధుల మీదుగా సాగి, మధ్యాహ్నం 12గంటలకు మళ్ళీ ఆలయానికి చేరుకుంది. ప్రస్తుతం ఎండలు మండుతున్న కారణంగా రథోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మజ్జిగ, తాగునీరు, పండ్లు, ఆహారం పంపిణీ చేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భద్రతా విధులు నిర్వహించారు.

దక్షిణాసియాలోనే పరిశ్రమలకు అనువైన రాష్ట్రం

- గోద్రెజ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్



గోద్రెజ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తిని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణాసియాలోనే పారిశ్రామిక పెట్టుబడులకు అనువైన రాష్ట్రం తమిళనాడేనని, దేశంలోని బహుళజాతి సంస్థలే కాకుండా విదేశీ సంస్థలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు బారులు తీరుతున్నాయని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. 2030లోగా రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థికాభివృద్ధిని సాధించిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకున్నామని చెప్పారు. చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూరు యూనియన్ పరిధిలోని పయ్యనూరు సిప్కాట్‌లో రూ.515 కోట్లతో నిర్మించిన గోద్రెజ్ కర్మాగారాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఎం ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు పెట్టేందుకు వచ్చే సంస్థలకు అన్ని సదుపాయాలు కల్పిస్తుండటం వల్లే విదేశీ సంస్థలు సైతం పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయని, పరిశ్రమలు నెలకొల్పటంలో ఎక్కడా అనవసర జాప్యం లేకుండా జాగ్రత్త వహిస్తున్నామని చెప్పారు. 2023 ఆగస్టులో గోద్రెజ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఐదు నెలల తర్వాత 2024 జనవరిలో ప్రపంచపెట్టుబడిదారుల మహానాడులో ఆ కర్మాగారానికి శంకుస్థాపన చేశామన్నారు. ప్రస్తుతం యేడాది గడిచిన తర్వాత ఆ కర్మాగారంలో తన చేతుల మీదుగానే ఉత్పత్తులను ప్రారంభించడం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. దేశ ఆర్థికాభివృద్ధి అధిక వాటాను కలిగిన ద్వితీయ రాష్ట్రం కూడా తమిళనాడేనని చెప్పారు. ప్రస్తుతం గోద్రెజ్ ఫ్యాక్టరీలో 50 శాతం దాకా మహిళలు, హిజ్రాలు, దివ్యాంగులకు ఉద్యోగావకాశాలు కల్పించడం కూడా ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామో అన్బరసన్, టీఆర్‌బీ రాజా, ఎంపీ సెల్వం, ఎమ్మెల్యే బాలాజీ, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, రాష్ట్ర పారిశ్రామిక మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తారోస్ అహ్మద్, చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ ఎస్. అరుణ్‌రాజ్, గోద్రెజ్ గ్రూపు ఛైర్మన్ నాదిర్ గోద్రెజ్, గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సంస్థ సీఈఓ సుధీర్ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగంలో చేరాలంటే తమిళం రాయడం, చదవడం తెలియాల్సిందే

- స్పష్టం చేసిన హైకోర్టు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలంటే తమిళం చదవడం, రాయడం తెలిసి ఉండాలని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. 2022లో విద్యుత్ బోర్డులో జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన తాను రెండేళ్లలో తమిళ భాషా పరీక్షలో ఉత్తర్ణత కాకపోవడంతో తనను విధుల నుంచి తొలగించారని, ప్రస్తుతం తాను టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన భాషా పరీక్ష పాసైనందున తనను మళ్లీ ఉద్యోగంలో చేర్చుకునేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ తేనికి చెందిన జయకుమార్ హైకోర్టును ఆశ్రయించగా.. సింగిల్ జడ్జి అతడికి అనుకూలంగా తీర్పునిచ్చారు. దీనిని సవాల్ చేస్తూ విద్యుత్ బోర్డు ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీలు చేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ పూర్ణిమతో కూడిన ధర్మాసనం ఆ అప్పీలుపై విచారణ జరిపింది. జయకుమార్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ తండ్రి నౌకాదళాధికారి కావడంతో వరుస బదిలీలు జరిగేవని, అందువల్ల అతను సీబీఎస్ఈ సిల్‌బస్ చదవాల్సి రావడంతో తమిళం నేర్చుకోలేకపోయాడన్నారు. ప్రస్తుతం తమిళ భాషా పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడని, అందువల్ల అతడ్ని విధుల్లోకి తీసుకోవాలని అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలంటే తమిళంలో మాట్లాడడం, రాయడం తెలిసి ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. తమిళనాడులోని ప్రభుత్వ ఉద్యోగులకు తమిళం తెలియకపోతే ఎలా? అతను రోజువారీ విధులు ఎలా నిర్వహించగలడని ప్రశ్నించింది. ఏ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులైనా ఆ రాష్ట్ర భాష తెలిసి ఉండాలని అభిప్రాయపడింది. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే భాషా పరీక్షలో నిర్దేశిత వ్యవధిలో ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొంది. రాష్ట్ర అధికార భాష తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎలా ఆశపడతారని ప్రశ్నిస్తూ.. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును నిలుపుదల చేసింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

హైకోర్టులో ఇద్దరు శాశ్వత న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

ప్యారీస్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఘన చరిత్ర కలిగిన మద్రాస్ హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ ఆర్.శక్తివేల్, జస్టిస్ ధనపాల్ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ వారితో సోమవారం ప్రమాణం చేయించారు. జస్టిస్ ఆర్.శక్తివేల్, జస్టిస్ ధనపాల్ 2023వ సంవత్సరం మేలో హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు. వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలిజీయం ప్రతిపాదనను కేంద్రప్రభుత్వం పరిశీలించి అనుమతిచ్చింది. ఆ మేరకు మద్రాస్ హైకోర్టు ప్రాంగణంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో శాశ్వత న్యాయమూర్తులుగా వీరిద్దరి చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ ప్రమాణస్వీకారం చేయించారు.



జస్టిస్ ఆర్.శక్తివేల్, జస్టిస్ ధనపాల్

కార్యక్రమంలో న్యాయమూర్తులు, ప్రభుత్వ న్యాయవాదులు పాల్గొన్నారు. కాగా, మద్రాస్ హైకోర్టులో 75 న్యాయమూర్తుల పోస్టుల్లో ప్రస్తుతం ఖాళీ ఉన్న పది న్యాయమూర్తుల పోస్టులను భర్తీ చేయాల్సివుంది.

రూ.318కే వంట గ్యాస్

- రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం
- చెన్నైలో అందరికీ ఉచిత బస్సు ప్రయాణం
- పీఎంకే షాడో బడ్జెట్‌లో ప్రతిపాదనలు



షాడో బడ్జెట్ విడుదల చేస్తున్న డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు అనుమణి, జీకే మణి, ఏకే మూర్తి తదితరులు

చెన్నై, మార్చి 10 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో రూ.318 లకు వంటగ్యాస్ ఇవ్వాలని, మే 1 నుంచి సంపూర్ణ మద్యనిషేధం అమలు చేయాలని, రాజధాని నగరం చెన్నైలో అందరికీ ఉచిత బస్ సదుపాయం కల్పించాలని పీఎంకే సోమవారం విడుదల చేసిన షాడో బడ్జెట్‌లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసింది. ఈ షాడో బడ్జెట్‌ను పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, పార్టీ అధ్యక్షుడు అన్బుమణి విడుదల చేశారు. మొత్తం 359 ప్రతిపాదనలతో ఈ బడ్జెట్ రూపొందించారు. రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ రూ.5,43,442 కోట్లుగా చూపెట్టారు. ఇది గత యేడాదికంటే రూ.1,91,602 కోట్లు అధికమన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు క్వారీలకు బదులుగా ఖనిజవనరుల తవ్వకాలు చేపడితే ఆదాయం వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో జూలై 25 జన గణన నిర్వహించాలని, దీనికోసం రూ.400 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి సూచించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనవరి 25 ప్రపంచ తమిళ మాతృభాషా దినంగా పాటించాలని, ఏప్రిల్ ఒకటి నుండి పాత పింఛన్ పథకం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కూడా పేర్కొన్నారు. కోయంబేడు బస్‌స్టేషన్‌ను ఉద్యానవనంగా మార్చాలని సూచించారు.

సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు లబ్ధి

- పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాసనాథన్
- పుదువై బడ్జెట్ సమావేశాలు ప్రారంభం



ప్రసంగిస్తున్న లెఫ్టినెంట్ గవర్నర్

పుదుచ్చేరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, వృద్ధులు, అణగారిన వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతూ సంతోషంగా ఉన్నారని లెఫ్టినెంట్ గవర్నర్ కైలాసనాథన్ పేర్కొన్నారు. పుదుచ్చేరి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు సోమవారం రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గవర్నర్ తమిళంలో ప్రసంగించారు. గత నాలుగేళ్ళలో రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2,444 పోస్టులను ప్రత్యక్షంగా, పోటీ పరీక్షల ద్వారా భర్తీ చేశామన్నారు. మిగిలిన ఖాళీలను భర్తీ చేయనున్నామన్నారు. గవర్నర్ ప్రసంగం తర్వాత సభలో జాతీయ గీతాలాపన చేశారు. సభను స్పీకర్ సెల్వం మంగళవారానికి వాయిదా వేశారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు సభా కార్యక్రమాలు ప్రారంభమై గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై సభ్యులు ప్రసంగిస్తారు. ఈ నెల 12న ముఖ్యమంత్రి ఎన్.రంగాస్వామి సభలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

కోలుకున్న దయాళు అమ్మాళ్

- ఆస్పత్రి నుంచి డిశ్చార్జి

టి.నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత నాలుగురోజులుగా అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందిన ముఖ్యమంత్రి స్టాలిన్ మాతృమూర్తి దయాళ్ అమ్మాళ్ చికిత్స తర్వాత పూర్తిగా కోలుకున్నారు. ఆదివారం రాత్రి ఆమె ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఈ నెల 5 రాత్రి శ్వాసకోశ సమస్య ఏర్పడి ఆమె అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆమెను కుటుంబీకులు చికిత్స కోసం అపోలో ఆస్పత్రికి తరలించారు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న ఆమెకు వైద్యనిపుణులు ఎమెర్జెన్సీ విభాగంలో చికిత్స అందించారు. రెండు రోజులకే ఆమె ఆరోగ్య కుదుటపడినా మరో రెండు రోజులు ఆమె ఆరోగ్య పరిస్థితి పరిశీలించిన మీదట డిశ్చార్జ్ చేశారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళవారం) : 6.26

సహర్ (బుధవారం) : 4.39

సమాచార దర్శిని

ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ఏడాదికి రెండు సార్లు పరీక్షలు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్ష 'సెట్' ఏడాదికి రెండు సార్లు నిర్వహించనున్నట్లు ఉపాధ్యాయు ఎంపిక బోర్డు (టీఆర్బీ) అధికారులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన పరీక్షా ఫలితాలు త్వరలో విడుదల చేసి, జూన్‌లో 4,000 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీచేయనున్నారు. వచ్చే మూడేళ్లలో, ఏడాదికి రెండు సార్లు 'సెట్' పరీక్ష నిర్వహించి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు టీఆర్బీ తెలియజేసింది.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలై, అన్నానగర్, గిండి ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. అన్నాసాలై పరిధిలో చింతాద్రిపేట లాబాండ్ వీధిలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, అన్నానగర్ పరిధిలో అన్నానగర్ 10వ మెయిన్ రోడ్డు, ఐదవ వీధి, నెం.1100 హెచ్ బ్లాక్‌లోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, గిండి పరిధిలో నంగనల్లూర్ హిందూ కాలనీ వందడుగుల రోడ్డులో ఉన్న ఉప విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం ఉదయం 10 గంటలకు జరుగనున్న కార్యక్రమంలో, ఆయా ప్రాంతాల పరిధిలోని వినియోగదారులు పాల్గొని విద్యుత్ సంబంధిత సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తూత్తుకుడి విమానాశ్రయం ఆధునికీకరణ

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ నిర్మాణపనులు 90 శాతం ముగిశాయి. ప్రస్తుతం ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్‌లో 'రాడార్లు', లింక్ చెకింగ్ పనులు జరుగుతున్నాయి. అలాగే, విమానాలు ల్యాండింగ్‌కు వీలుగా రన్‌వేలో 'నావిగేషన్ లైట్స్' అమర్చుతున్నారు. ప్రస్తుతం తూత్తుకుడి నుంచి చెన్నై, బెంగళూరు మాత్రమే విమానాలు నడుపుతుండగా, పనులు పూర్తయిన తర్వాత విమాన సంస్థలు పలు నగరాలకు విమానాలు నడిపేందుకు సిద్ధంగా ఉన్నాయని తూత్తుకుడి విమానాశ్రయ డైరెక్టర్ రాజేష్ తెలిపారు.

ఐఐటీలో కొత్తగా ఆన్‌లైన్ కోర్సులు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక సంస్థలు, విద్యా సంస్థల భాగస్వామ్యంతో మద్రాసు ఐఐటీ కొత్త 'ఆన్‌లైన్' కోర్సులు ప్రారంభించనుంది. పారిశ్రామిక సంస్థలు ఆశించిన అర్హతలతో కూడిన విద్యార్థులను అందించేలా మద్రాసు ఐఐటీ 'స్వయం ప్లస్' అనే పథకం ప్రారంభించింది. ఇందుకోసం 50కు పైగా ప్రముఖ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. వాటిలో, సత్యభామ విశ్వవిద్యాలయం, త్యాగరాజర్ ఆర్ట్స్ కళాశాల, త్యాగరాజర్ ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, వినాయక మిషన్ లా స్కూల్ సహా పలు సంస్థలున్నాయి. తొలివిడతగా 2,500 మంది విద్యార్థులకు 35కు పైగా కోర్సులు ఆన్‌లైన్ ద్వారా అందించాలని మద్రాసు ఐఐటీ నిర్ణయించింది. ఇందులో 10వేల విద్యార్థులను చేర్చుకోవాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఐఐటీ తెలియజేసింది.

కేంద్రీయ విద్యాలయాల్లో అడ్మిషన్లు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయాల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 21వ తేదిలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రంలో 45 సహా దేశవ్యాప్తంగా 1,256 కేంద్ర విద్యాలయ పాఠశాలలున్నాయి. వీటిలోని కొన్ని పాఠశాలల్లో మాత్రమే 3 ఏళ్లు నిండిన పిల్లలను 'బాల్వాడిక' అనే కేజీ తరగతిలో చేర్చుకునే వెసులుబాటు ఉండగా, మిగిలిన పాఠశాలల్లో 6 ఏళ్లు పూర్తయిన చిన్నారులను 1వ తరగతిలో చేర్చవచ్చు. ఈ విద్యా సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తు స్వీకరణ శనివారం ప్రారంభమై ఈ నెల 21వ తేది వరకు జరుగనుంది. https://balvatika.kvs.gov.in/ అనే వెబ్‌సైట్‌లో చిన్నారుల వివరాలు, బర్త్ సర్టిఫికెట్ తదితరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఎంపిక విద్యార్థుల తొలి జాబితా ఈ నెల 25,26 తేదీల్లోను, రెండో జాబితా వచ్చే నెల 2న, మూడవ జాబితా 7వ తేది విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

తూత్తుకుడి, తిరుచ్చికి అదనపు విమానాలు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై నుంచి తూత్తుకుడి, తిరుచ్చికి అదనపు విమాన సర్వీసులు నడిపేందుకు విమానయాన మంత్రిత్వ శాఖ ఆమోదించింది. నగరం నుంచి తూత్తుకుడి, తిరుచ్చి ప్రాంతాలకు వెళ్లే వారి విమాన ప్రయాణికుల సంఖ్య అధికమవుతున్న నేపథ్యంలో, ఈరెండు నగరాలకు అదనపు విమాన సర్వీసులు నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం చెన్నై నుంచి తూత్తుకుడికి ఇరుమార్గాల్లో ప్రతిరోజు 8 విమాన సేవలు, తిరుచ్చికి 14 విమాన సేవలున్నాయి. ఈ నేపథ్యంలో, చెన్నై - తూత్తుకుడి మధ్య 12 సర్వీసులు, చెన్నై-తిరుచ్చి మధ్య 22 సర్వీసులు నడపాలని నిర్ణయించినట్లు, ఈనెల 30వ తేది నుంచి అదనపు విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

ప్యాసింజర్‌లో సాంకేతిక లోపం

● అరక్కోణం రైల్వేస్టేషన్‌లో నిలిపివేత

తిరుత్తణి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లాలోని అరక్కోణం రైల్వేస్టేషన్ నుండి కడపకు సోమవారం ఉదయం 7 గంటలకు బయల్దేరిన ప్యాసింజర్ రైలు ఇంజన్ నుండి హఠాత్తుగా పొగలు రావడంతో తిరుత్తణి రైల్వేస్టేషన్‌లో నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే సిబ్బంది సుమారు 50నిమిషాలపాటు శ్రమించి రైలింజన్‌కు మరమ్మతు చేశారు. ఇంజన్ ఓవర్‌హీట్ కారణంగా పొగలు వచ్చాయని, దీనివల్ల భయపడాల్సిందేమి లేదని అధికారులు తెలిపారు. మరమ్మతు పూర్తయ్యాక ఉదయం 7.55గంటలకు ఆ రైలు బయల్దేరింది.



నిలిపివేసిన రైలు (ఇన్‌సెట్‌లో) ఇంజిన్‌లో పొగలు వచ్చిన ప్రాంతం

లారీని ఢీకొన్న అంబులెన్స్

● ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన అంబులెన్స్, లారీ

టి.నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కళ్ళకురిచ్చి జిల్లా ఉలుందూరుపేట సమీపం సేలం జాతీయ రహదారిలో సోమవారం ఉదయం కట్టెల లోడుతో వస్తున్న లారీని అంబులెన్స్ ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ అంబులెన్స్‌లో సెల్వకుమార్ అనే రోగి, ఆయన తల్లి, వైద్యసహాయకుడు సహా నలుగురు ప్రయాణించారు. లారీని ఢీకొనడంతో అంబులెన్స్ నుజ్జునుజ్జయ్యింది. దానిలో ప్రయాణించిన సెల్వకుమార్ సహా ముగ్గురు గాయపడ్డారు. ఈ సమాచారం అందగానే పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోతి మాంసం తిన్న ఇద్దరి అరెస్టు



అరెస్టయిన జయమణి, రాజారామ్‌తో అటవీ శాఖ అధికారులు

టి.నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వీరచిన్నంపట్టి వద్ద మామిడి తోటలోకి కాయలు తిన్న కోతిని తుపాకీతో చంపిన ఇద్దరిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. వీరచిన్నంపట్టికి చెందిన కేటరింగ్‌మాస్టర్ రాజా (33)కు మామిడి తోట ఉంది. ఆ తోటలో గత కొద్ది రోజులు కోతులు సంచరించడంతో వాటిని తరిమేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చివరకు కొబ్బరి కాయలు కోసే కార్మికుడు జయమణి (31) సాయం కోరారు. అతడికి రూ.1000లను కూలీ ఇచ్చి తన తోటలో సంచరించే కోతుల బెడద తొలగించమని కోరారు. ఆ ప్రకారం జయమణి నాటు తుపాకీతో తోటలో సంచరిస్తున్న కోతిని కాల్చి చంపాడు. ఆ తర్వాత కోతిమాంసాన్ని వండుకుతిన్నాడు. ఇలా జయమణి కోతిని చంపి దాని మాంసాన్ని వండుకు తినే దృశ్యాలను ఎవరో వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగి రాజారామ్, జయమణిని అరెస్టు చేశారు. కోతి చర్మం, నాటు తుపాకీ, తూటాలను స్వాధీనం చేసుకున్నారు.

మిత్రుడిపై కత్తితో దాడి

● ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువీకానగర్‌లో మిత్రుడిపై కత్తితో దాడికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెరంబూరు కెనడీ ప్రాంతానికి చెందిన భరత్ (23), తిరువీకానగర్ చేపల మార్కెట్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన అతడి మిత్రులు ఇళంగో, రామ్‌కుమార్ శనివారం సాయంత్రం మద్యం మత్తులో వృత్తి పరమైన కక్షతో భరత్‌పై కత్తితో దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీనిపై అందజేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు ఆదివారం నిందితులను అరెస్టుచేసి, వారు వినియోగించిన ఆటో కూడా స్వాధీనం చేసుకున్నారు. విచారణలో ఇళంగో, రామ్‌కుమార్లపై ఇప్పటికే 20కి పైగా కేసులున్నట్లు తెలిసింది. సోమవారం ఉదయం వీరిని కోర్టులో హాజరుచి, పుళల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు.

బాల్య వివాహం జరిపించిన తండ్రి సహా నలుగురిపై కేసు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో బాల్యవివాహం జరిపించిన తండ్రి సహా నలుగురిపై పోక్సో చట్టం ద్వారా కేసు నమోదైంది. ఏర్కాడు సమీపం కరడియూర్‌కు చెందిన 17 బాలిక పిల్లల భద్రత సంరక్షణ కేంద్రాన్ని సంప్రదించి, తనను బలవంతంగా వివాహం చేసుకొని లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేసింది. అధికారులు బాలికను విచారించి ఫిర్యాదు వాస్తవమని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, వివాహం చేసుకున్న 38 ఏళ్ల వ్యక్తిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. అలాగే, వివాహం జరిపించిన బాలిక తండ్రి, అవ్వ, అత్తలపై కూడా పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

మదురై జల్లికట్టు స్టేడియం వద్ద అగ్నిప్రమాదం



మంటల్లో కాలుతున్న షెడ్డు

టి.నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మదురై కీళక్కరై ప్రాంతంలో కలైంజర్ శతజయంతి స్మారక జల్లికట్టు స్టేడియం సమీపంలోని సిబ్బంది బస చేసే షెడ్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ స్టేడియం వద్ద జల్లికట్టు క్రీడ చూడటానికి వచ్చిన దుండగులెవరో ఆ షెడ్‌కు నిప్పంటించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే అగ్నిమాపక దళం హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

మోర్ధానా కాలువలో రూ.2.50 కోట్లతో పూడికతీత



పనులు ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేవి కుప్పం సమీపంలోని మోర్ధానా కాలువలో రూ.2.50 కోట్లతో చేపట్టనున్న పూడికతీత పనులను సోమవారం నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... జిల్లాలోని పాలారు నదిపై పలు చెక్‌డ్యాంలు నిర్మించామని, కవబమ్‌పట్టు ప్రాంతంలో మరో చెక్‌డ్యాం నిర్మించనుననట్టు తెలిపారు. ఈ చెక్‌డ్యాం నిర్మాణంతో కావనూరు ప్రాంతాల్లో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, అమ్ములు, పంచాయతి మండ్రం అధ్యక్షుడు రవిచంద్రన్, సత్యానందం, మోర్ధానా డ్యాం కంట్రోల్ ఇంజనీర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైళ్లలో 'యాంటీ ట్రాక్ సిస్టమ్'



పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్ల తలుపుల్లో బట్టలు, బ్యాగులు ఇరుక్కుపోకుండా కొత్త టెక్నాలజీ ప్రవేశపెట్టనున్నట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు తెలిపారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ప్రస్తుతం నగరంలో నడుపుతున్న మెట్రోరైలు డోర్ సెన్సార్లు 10 మి.మీ మందం ఉంటేనే అడ్డంకులను గుర్తించగలవని తెలిపారు. అయినా, చాలా వరకు దుస్తులు, బ్యాగు పట్టీలు 0.3 మి.మీ కంటే తక్కువగా ఉండడంతో సెన్సార్లు వాటిని గుర్తించలేకపోతున్నాయన్నారు. అలాంటి సమయంలో భద్రతా సిబ్బంది, ప్రయాణికులు ఎమర్జెన్సీ బటన్ నొక్కాల్సి ఉందన్నారు. ఈ సమస్య పరిష్కరించేలా అన్ని మెట్రోరైళ్లలో 'యాంటీ ట్రాక్ సిస్టమ్' అనే కొత్త టెక్నాలజీ అమర్చనున్నామని, ఇందుకు రూ.40 కోట్ల వరకు ఖర్చవుతుందని తెలిపారు. మెట్రోరైలు డోర్ల మధ్య రబ్బర్ బెల్ట్ మార్చి ఈ కొత్త టెక్నాలజీతో కూడిన సెన్సార్ సిస్టమ్ ఏర్పాటుచేయనున్నామన్నారు. మెట్రోరైలు డోర్లలో చిక్కుకున్న వస్తువుల నుంచి వచ్చే స్వల్ప శక్తిని కూడా ఇది గుర్తించగలదని, అలాగే, ప్రయాణికుడిని లాగే సమయంలోనూ అత్యవసర బ్రేక్ పనిచేసేందుకు కూడా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

26న స్వాధీనం చేసుకున్న వాహనాల వేలం

● గ్రేటర్ చెన్నై పోలీసులు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్ల పక్కన పార్కింగ్ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వాటిని వేలం వేయనున్నట్లు ప్రకటించారు. రాజధాని నగరం చెన్నైలో నేరాలను అరికట్టడం, పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ క్రమబద్ధీకరించేలా గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ పలు చర్యలు చేపడుతోంది. ట్రాఫిక్ అంతరాయం కలిగించే దీర్ఘకాలంగా రోడ్డుపక్కన పార్కింగ్‌చేసిన వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ వాహనాల వివరాలు ప్రకటించగా, కొందరు యజమానులు జరిమానా చెల్లించి వాహనాలు తీసుకెళ్లగా, మరికొన్ని వాహనాలకు ఎవరూ రాలేదు. దీంతో స్వాధీనం చేసుకున్న 953 ద్విచక్రవాహనాలు, 11 మూడు చక్రాలు, 9 నాలుగు చక్రాల వాహనాలను ఈ నెల 26వ తేది ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు పోలీసు శాఖ ప్రకటించింది. పుదుపేటలోని సాయుధ దళ పోలీసుల క్వార్టర్స్ మైదానంలో ఈ వాహనాలు వీక్షించేందుకు ఉంచారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19,20 తేదీల్లో పుదుపేట మైదానంలో జరిగే శిబిరంలో పాల్గొని, గుర్తింపుకార్డు, జీఎస్టీ నెంబరుతో డిపాజిట్ చెల్లించి పేరు నమోదుచేసుకోవాల్సి ఉంటుంది. వేలంలో పాల్గొనే వారు మరుసటిరోజు వేలం నగదు, జీఎస్టీ కలిపి చెల్లించాలని చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ప్రకటనలో తెలిపారు.

భవిష్యత్ ఆర్థిక అభద్రతపై 60 శాతం శాండ్‌విచ్ జనరేషన్ దిగులు

● ఎడెల్విస్ లైఫ్ అధ్యయనంలో వెల్లడి

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తాము ఎంత ఆదా చేసినా, అది భవిష్యత్తు కోసం సరిపోదంటూ 60 శాతం 'శాండ్‌విచ్ జనరేషన్' దిగాలు చెందుతోందని 'ఎడెల్విస్ లైఫ్' లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ చేపట్టిన అధ్యయనం తేలింది. 35-54 సంవత్సరాల వయసున్న వారిని శాండ్‌విచ్ జనరేషన్ అంటారు. వీరు రెండు తరాల కోసం ఆర్థికంగా సహాయపడుతుంటారు. తమ తల్లిదండ్రులైన వృద్ధుల కోసం, పెరుగుతున్న పిల్లల ఆర్థికావసరాలకు వీరు అండగా వుంటారు. 12 నగరాల్లో 4,005 మంది అభిప్రాయాలు చేపట్టిన సంస్థ.. ఇటీవల నివేదిక వెల్లడించింది. దీని గురించి సంస్థ సీఈవో సుమీత్ రాయ్ మాట్లాడుతూ.. శాండ్‌విచ్ జనరేషన్ భవిష్యత్ కోసం వారు సిద్ధంగా లేరనే భావనకు లోనవుతున్నట్లు తెలిపారు.

తేనెటీగల దాడిలో విద్యార్థులకు గాయాలు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చి సమీపంలో తేనెటీగల దాడిలో 30 మంది కళాశాల విద్యార్థులకు గాయాలయ్యాయి. కోవై సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థులు సోమవారం ఆళియారు డ్యాం వద్దకు విహార యాత్రకు వెళ్లారు. దట్టమైన చెట్లతో ఉన్న ప్రాంతంలో విద్యార్థులు వెళుతున్న సమయంలో, హఠాత్తుగా వచ్చిన కొండ తేనెటీగలు వారిపై దాడిచేశాయి. ఈ దాడిలో సుమారు 30 మందికి గాయాలు కాగా చుట్టుపక్కల వారు వారిని వెంటనే పొల్లాచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

త్రిభాషా విద్యావిధానానికి మద్దతుగా 23 నుంచి బీజేపీ బహిరంగ సభలు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విద్యా విధానానికి మద్దతుగా ఈ నెల 23 నుండి ఎనిమిది నగరాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. 23న తిరుచ్చిలో 25న తిరునల్వేలిలో, ఏప్రిల్ 5న వేలూరు, 12న కాంచీపురంలో, 19న సేలంలో, 26న చెన్నైలో మే 3న మదురై, మే 11న కోయంబత్తూరులో ఈ సభలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఎరువుల తయారీ కర్మాగారం పరిశీలన



చెత్త విభజన ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వెంకటాపురం పంచాయతీ పరిధిలో గ్రామీణాభివృద్ధి శాఖ రూ.21.55 లక్షలతో నిర్మించిన బయో ఎరువుల కర్మాగారం పనిచేస్తోంది. ఈ కర్మాగారాన్ని సోమవారం కలెక్టర్ సుబ్బలక్ష్మి పరిశీలించారు. కలెక్టర్ వెంట గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్ కుమారన్, పంచాయతీ అసిస్టెంట్ డైరెక్టర్ తిరుమాళ్, వేలూరు బీడీఓ విన్సెంట్ రమేష్‌బాబు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

కచ్చాదీవు ఉత్సవాలకు వెళ్లనున్న పడవలు

● నేడు పరిశీలించనున్న మత్స్యశాఖ అధికారులు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కచ్చాదీవు ఉత్సవాలకు వెళ్లే పడవలను మత్స్యశాఖ అధికారులు మంగళవారం పరిశీలించనున్నారు. కచ్చాదీవు సెయింట్ ఆంటోని ఆలయ ఉత్సవాలు ఈ నెల 14,15 రెండు రోజుల పాటు జరుగనున్నాయి. ఈ ఆలయ వేడుకలకు రామేశ్వరం నుంచి 90 మర పడవలు, 22 నాటుపడవలు వెళ్లేందుకు ఉత్సవ కమిటీ వద్ద పడవల యజమానులు పేర్లు నమోదుచేసుకున్నారు. అలాగే, ఈ వేడుకల్లో పాల్గొనేందుకు సుమారు మూడువేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో, ఉత్సవాలకు వెళ్లేందుకు నమోదుచేసుకున్న పడవలను అధికారులు పరిశీలించనున్నారు. అధికారులు పరిశీలనకు వచ్చే సమయంలో పడవలకు సంబంధించిన అన్నిరకాల పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని పడవల యజమానులకు సూచించారు.

గూండా చట్టం కింద ముగ్గురు యూట్యూబర్ల అరెస్ట్



అరెస్టయిన యూ ట్యూబర్లు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పిల్లలతో అసభ్య రీల్స్ చిత్రీకరించిన వ్యవహారంలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు యూట్యూబర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరుకు చెందిన చిత్ర 'మక్కల్ పార్వై' అనే య్యూ ట్యూబ్ ఛానల్ నడుపుతోంది. 'దివ్య కలాచ్చి' అనే యూట్యూబ్ ఛానల్ నడుపుతున్న తంజావూరుకు చెందిన దివ్య, ఈరోడ్‌కు చెందిన 'కీళక్కరై కార్తీక్' అనే యూట్యూబ్ ఛానల్ నడుపుతున్న కార్తీక్‌లు విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్‌లో పిల్లలతో అశ్లీల రీల్స్ చేసినట్లు చెన్నై డీజీపీ కార్యాలయంలో చిత్ర ఫిర్యాదు చేసింది. అలాగే, తన బ్యాంక్ ఖాతా హ్యాక్ చేసి రూ.2.50 లక్షలు దివ్య కాజేసిందని చిత్ర ఫిర్యాదులో పేర్కొంది. ఈ వ్యవహారంలో విరుదునగర్ జిల్లా పిల్లల సంక్షేమ శాఖ అధికారి మీనాక్షి బాధిత పిల్లలను విచారించింది. అందులో, కొద్ది నెలల క్రితం యూట్యూబర్లు దివ్య, కార్తీక్ తమను శ్రీ విల్లిపుత్తూర్‌లో ఉంచి అశ్లీల రీల్స్ చిత్రీకరించినట్లు తెలిసింది. ఈ విషయమై అధికారి మీనాక్షి ఫిర్యాదుతో దివ్య, కార్తీక్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, ఫిర్యాదు చేసిన చిత్ర చెప్పడంతోనే ఈ రీల్స్ తీసినట్లు పేర్కొన్నారు. దీంతో, వీరిపై పోక్సో సహా నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన పోలీసులు వారి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు విచారిస్తున్న శ్రీవిల్లిపుత్తూర్ మహిళా పోలీసులు యూ ట్యూబర్లు చిత్ర, కార్తీక్, దివ్యలను గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు.

వీధి కొళాయి గొడవల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జగడాలు

● వీకే శశికళ విమర్శ



ఇఫ్తార్ విందులో శశికళ

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర ఆరోపణలు వీధి కొళాయిల వద్ద జరిగే తగాదాల్లా ఉన్నాయని వీకే శశికళ విమర్శించారు. తిరువారూరు జిల్లా ముత్తుపేట సమీపంలోని జాంబువానోడై ప్రాంతంలో ప్రసిద్ధిచెందిన షేక్ దావూద్ దర్గాలో రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా ఆదివారం ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శశికళ, తొలుత షేక్ దావూద్ సమాధి వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలతో కలసి ఇఫ్తార్ విందు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... డీఎంకే నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రాభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు చేపట్టిన చర్యలు శూన్యమన్నారు. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో నెరవేర్చి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందడం న్యాయమని, కానీ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోపణలు వీధి కొళాయి వద్ద జరిగే తగాదాల్లో మారాయని విమర్శించరు. ఇకనైనా ఇలాంటి చర్యలు మాని ప్రజల కోసం పనిచేయాలని ఆమె ప్రభుత్వాలకు హితవు పలికారు.

డీఎంకే ఎంపీలు నియోజకవర్గ ప్రజలను కలవడంలేదు

● బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై

ప్యారీస్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీలు వారి నియోజకవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడంలేదని, నియోజకవర్గాల్లో పర్యటించడంలేదని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. ఈ మేరకు ఆమె తన ఎక్స్‌పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా వున్నాయి. 'రాష్ట్రంలో ఏళ్ళ తరబడి కొలిక్కిరాని అనేక సమస్యతలున్నాయని, వీటి గురించి పార్లమెంటు ఉభయ సభల్లో డీఎంకే ఎంపీలు ప్రస్తావించడం అంతంత మాత్రమేనన్నారు'. ముందు తమ పార్లమెంటు నియోజకవర్గాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు డీఎంకే ఎంపీలు శ్రద్ధ చూపాలని ఆ తర్వాతే పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన గురించి మాట్లాడాలని తమిళిసై ఎద్దేవచేశారు.

పుచ్చకాయల దుకాణంలోకి చొరబడిన ఏనుగు



పుచ్చకాయలు ఆరగిస్తున్న ఏనుగు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కనున్న దుకాణంలోకి చొరబడిన ఏనుగు ఆహారం కోసం పుచ్చకాయలు తీసుకుంది. మేట్టుపాళయం-ఊటీ రహదారి పెట్రోల్ బంక్ సమీపంలో ఓ వ్యాపారి రోడ్డు పక్కనే పుచ్చకాయలు విక్రయిస్తున్నాడు. ఆదివారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికెళ్లిన సమయంలో, అర్ధరాత్రి దుకాణం వద్దకు వచ్చిన ఏనుగు, పుచ్చకాయలు ఆరగించింది. ఏనుగును గమనించిన వాహన చోదకులు మేట్టుపాళయం అటవీ సిబ్బందికి సమాచారంఇచ్చారు. సిబ్బంది అక్కడకు చేరుకొని టపాసులు కాల్చి ఆ ఏనుగును సమీపంలోని అడవిలోకి పంపించారు.

సామూహిక చేపలవేటలో గ్రామస్తులకు నిరాశ

టి.నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా విరాలిమలై సమీపం రాజగిరి కుళవాయిపట్టి గ్రామ చెరువులో సోమవారం నిర్వహించిన చేపలవేటలో చేపలు లభించక అంతా నిరాశతో వెనుదిరిగారు. రెండేళ్ల తర్వాత ఆ చెరువులో చేపలవేటకు వెళితే 2 నుండి 4 కేజీల బరువైన చేపలు లభిస్తాయని ప్రజలు ఆశ పెట్టుకున్నారు. చివరకు సోమవారం ఉదయం 7 గంటల నుండి 10 గంటల దాకా స్థానికులే కాకుండా చుట్టుపక్కల పది గ్రామాలకు చెందిన ప్రజలు వేకువజామునే ఈ ప్రాంతానికి చేరుకున్నారు. వలలు, వెదురుబుట్టలతో చెరువులో దిగినవారంతా చేపల కోసం పోటీపడ్డారు. చివరకు చెరువంతా గాలించినా చేపలు దొరకలేదు. ఈ చెరువులో దుండగులెవరో రాత్రికిరాత్రే భారీ వలలతో చేపలు పట్టుకుని పారిపోయి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

పాల ఉత్పత్తిదారులకు పరిహారం పెంపు


పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారులకు అందిస్తున్న పరిహారం, నిధుల సాయం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, అన్నా సహకార పాల ఉత్పత్తిదారుల సంక్షేమ నిధి నిబంధనలు సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రమాదాల్లో మృతిచెందే సభ్యులకు ఇచ్చే పరిహారం రూ.2.50 లక్షల నుంచి రూ.4 లక్షలకు పెంచింది. అలాగే, సభ్యుల ఇద్దరు బాలికల విద్యకు అందించే ప్రోత్సాహక నిధిని రూ.25,000 నుంచి రూ.50,000, ఒక యువతికి వివాహ నిధిని రూ.60,000 పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

యాభై ప్రాంతాల్లో కార్చిచ్చు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పది జిలాల్లోని 50 ప్రాంతాల్లో కార్చిచ్చు సంభవించిందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వేసవి ప్రారంభమైన నేపథ్యంలో, పలు అటవీ ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడుతోంది. ఆదివారం ఒకేరోజు నీలగిరి, తిరుప్పూర్, తేని, కృష్ణగిరి, వేలూరు, తిరుపత్తూర్, పెరంబలూరు, కళ్లకుర్చి, తిరువణ్ణామలై, రాణిపేట తదితర జిల్లాల్లోని 10 ప్రాంతాల్లో కార్చిచ్చు ఏర్పడిందని భారత అటవీ పరిశోధన సంస్థ సమాచారం అందజేసింది. ఆయా జిల్లాల అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో ఆ ప్రాంతాలకు చేరుకుని మంటలు అదుపుచేసే పనులు చేపట్టారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఉచిత టీకాలు

పెరంబూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వంద శాతం టీకాలు అందించే కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయని జిల్లాల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఉచిత టీకా కార్యక్రమం చేపట్టాలని ఆరోగ్యశాఖ నిర్ణయించింది. జాతీయ రోగ నిరోధకత కార్యక్రమంలో నిమోనియా, రూబెల్లా, ట్యూబర్‌కొలోసిస్, లివర్ ఇన్‌ఫెక్షన్, క్యాన్సర్, పోలియో, డైసెంటరీ సహా 11 రకాల టీకాలు వేస్తుంటారు. రాష్ట్రంలో ప్రతి ఏడాది 9.40 లక్షల మంది చిన్నారులకు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రులు, జిల్లా ప్రధాన ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కలిపి 11వేల ప్రాంతాల్లో టీకాలు వేస్తున్నారు. వాటిలో 90 శాతానికి పైగా పూర్తిగా వేసినా, ఒక డోస్ వేసిన తర్వాత, మరో డోస్ పూర్తిగా వేయలేని పరిస్థితి నెలకొంది. దీనిని నివారించి వంద శాతం టీకాలు వేసే చర్యల్లో భాగంగా, టీకాలు తక్కువగా వేసే జిల్లాలను గుర్తించి, ఆయా జిల్లాల్లో ప్రభుత్వాసుపత్రుల్లో వేస్తున్నట్లు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఉచిత టీకాలు వేయాలని నిర్ణయించిన ఆరోగ్యశాఖ, 100 శాతం పూర్తిచేయలేని జిల్లాలు, ప్రాంతాల వివరాలు సేకరిస్తోంది.



చెన్నై సచివాలయం ఎదురుగా కామరాజర్‌సాలైలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కార్లు. ఈ సంఘటనలో ముగ్గురు చిన్నారులు స్వల్పంగా గాయపడ్డారు.

మూతపడుతున్న అలనాటి థియేటర్లు

● పెరుగుతున్న మల్టీప్లెక్స్‌లు



సైదాపేటలోని శ్రీనివాస థియేటర్

రాష్ట్రంలో సింగిల్ స్ర్కీన్ థియేటర్ల సంఖ్య నానాటికీ తగ్గిపోతోంది. ఓటీటీ యుగం ప్రారంభంకావడంతో సినిమా చూసేందుకు థియేటర్లకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. థియేటర్లకు ప్రేక్షకులకు రాకపోవడంతో కొత్త సినిమా విడుదల రోజు కూడా వెలవెలబోతున్నాయి. దీంతో కొత్త సినిమాల విడుదల రోజునే షో రద్దు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరికొన్ని థియేటర్లలో అతి తక్కువ మంది ప్రేక్షకులతో షోలు వేస్తున్నారు. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం విధించే వినోదపు పన్ను, కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ, రాష్ట్ర జీఎస్టీలను కూడా వసూలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేసే డబుల్ టాక్స్ విధానాన్ని రద్దు చేయాలంటూ పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇలాంటి సమస్యల కారణంగా రాష్ట్రంలోని పలు సింగిల్ స్ర్కీన్ థియేటర్లు క్రమంగా మూతపడుతున్నాయి. ఇప్పటివరకు రాజధాని చెన్నై నగరంలోని సింగిల్ స్ర్కీన్ థియేటర్లు మూతపడగా, ఇపుడు జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో ఉండే ఈ తరహా థియేటర్లు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. 2018 లెక్కల ప్రకారం రాష్ట్రంలో 721 సింగిల్ స్ర్కీన్ థియేటర్లుండేవి. 2021 నాటికి ఈ సంఖ్య 636కు, 2024 డిసెంబరు నెలాఖరునాటికి 572కు తగ్గింది. అదేసమయంలో మల్టీప్లెక్స్ థియేటర్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 2018లో రాష్ట్ర వ్యాప్తంగా మల్టీప్లెక్స్‌ల సంఖ్య 423గా ఉండగా, 2024కు ఈ సంఖ్య 610కి పెరిగింది. ఈ విషయంపై తమిళనాడు సినిమా థియేటర్స్ అండ్ మల్టీప్లెక్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు తిరుపూరు సుబ్రహ్మణ్యం స్పందిస్తూ, 'ప్రేక్షకుల అభిరుచులను బట్టి మనం కూడా మారాల్సిన పరిస్థితి వచ్చింది. వారి అవసరాలను తెలుసుకుని థియేటర్లను కూడా అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. అప్‌గ్రేడ్ చేసుకోని సింగిల్ స్ర్కీన్ థియేటర్లు మాత్రమే మూతపడుతున్నాయి' అని తెలిపారు.

'జైలర్-2' షూటింగ్ ప్రారంభం


'జైలర్-2'లో రజనీకాంత్

నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన సూపర్‌హిట్ మూవీ 'జైలర్'. దీనికి రెండో భాగం షూటింగ్ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా తన ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. 2023లో వచ్చిన ఈ చిత్రం తొలి భాగం బ్లాక్‌బస్టర్ హిట్ అయిన విషయం తెల్సిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ.600 కోట్ల మేర వసూలు చేసినట్టు మూవీ ట్రేడ్ వర్గాల సమాచారం. ఇపుడు రెండో భాగాన్ని తెరకెక్కిస్తుండగా, దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలిభాగంలో నటించిన నటీనటులు, పనిచేసిన సాంకేతిక నిపుణులు రెండో భాగానికి కూడా పనిచేస్తున్నారు. వీరితో పాటు మరికొంతమంది నటీనటులు కూడా చేరారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించే ఈ చిత్రాన్ని తమిళనాడు, కేరళ, హైదరాబాద్ నగరాల్లో చిత్రీకరించేలా ప్లాన్ చేస్తున్నారు. కాగా, రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రంలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకోవడంతో రజనీకాంత్ 'జైలర్-2' సెట్స్‌పైకి తీసుకెళ్ళారు.

మళ్లీ సినిమాల్లోకి రంభ

రూ.2 వేల కోట్లకు యజమాని అన్న నిర్మాత థాను


రంభ


కలైపులి ఎస్.థాను

తమిళ చిత్రజ్యోతి

దక్షిణాది చిత్రపరిశ్రమలో 90 దశకంలో ఓ వెలుగు వెలిగిన హీరోయిన్ రంభ రూ.2 వేల కోట్లకు అధిపతిరాలు అని ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను వెల్లడించారు. అలాంటి రంభ ఇపుడు సినిమాల్లో రీఎంట్రీ ఇచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నారన్నారు. ఒకపుడు చిత్రసీమలో ఓ వెలుగు వెలిగిన రంభ తెలుగు, తమిళంతో పాటు ఇతర బాషా చిత్రాల్లో నటించారు. 2010లో కెనడాకు చెందిన ప్రవాస తమిళ పారిశ్రామికవేత్త ఇంద్రకుమార్‌ను వివాహం చేసుకుని, కెనడాలోనే స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అపుడపుడూ చెన్నై వచ్చి వెళ్తున్న రంభ... ప్రస్తుతం సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చేందుకు అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నగరంలో జరిగిన ఒక ఆడియో రిలీజ్ వేడుకలో రంభతో పాటు ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను కూడా పాల్గొన్నారు. ఇందులో నిర్మాత థాను మాట్లాడుతూ, 'నటి రంభ రూ.2 వేల కోట్ల ఆస్తులకు అధిపతురాలు. ఆమె భర్త ఇంద్రకుమార్ పెద్ద బిజినెస్‌మేన్. కొన్ని రోజుల క్రితం ఆయన నా వద్దకు వచ్చి రంభ సినిమాల్లో రీఎంట్రీ ఇచ్చేందుకు మంచి అవకాశం ఇవ్వాలని కోరగా, ఒక మంచి కంపెనీలో సినిమా అవకాశం ఇప్పిస్తానని నేనే హామీ ఇచ్చాను' అని వెల్లడించారు. కాగా, రంభ భర్త ఆస్తుల విలువ రూ.2 వేల కోట్లు అని నిర్మాత థాను వెల్లడించడం ఇపుడు తమిళ చిత్రపరిశ్రమలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

రేపు 'మహా మఖం' వేడుకలు

● తంజావూరు జిల్లాకు సెలవు


మహామఖం తీర్థకొలను

ప్యారీస్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'మహా మఖం' వేడుకలను పురస్కరించుకుని తంజావూరుకు మార్చి 12, బుధవారం స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ప్రియాంక పంకజం సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మహామఖం అనేది దక్షిణ భారతదేశంలోని తమిళనాడు రాష్ట్రంలోని తంజావూరు జిల్లాలోవున్న కుంభకోణం పట్టణంలో జరిగే అతిపెద్ద హిందూ పండుగ. ప్రతి 12ఏళ్ళకోసారి జరిగే ఈ వేడుకకు దేశం నలుమూల నుండి లక్షలాది మంది భక్తులు వచ్చి, ఆ ప్రాంతంలోని తీర్థ కొలనుల్లో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకుంటుంటారు. తంజావూరు జిల్లాలో ఆలయాల నగరంగా ప్రసిద్ధిచెందిన కుంభకోణంలో 12ఏళ్ళ అనంతరం కోలాహలంగా నిర్వహించనున్న 'మహా మఖం' ఉత్సవాల నేపథ్యంలో కుంభకోణంలో వున్న పురాతనమైన పన్నెండు శివాలయాలు, ఐదు పెరుమాళ్ ఆలయాలకు 12ఏళ్ళకోసారి మహామఖం ఉత్సవం, ప్రతిఏటా మాసి మహామఖం ఉత్సవాలను ఆ ప్రాంతంలోవున్న మహామఖం ఘాట్లలో తీర్థవారి ఉత్సవాన్ని వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ ఏడాది మహామఖం ఉత్సవాలు గత శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో ప్రధానాంశమైన మాసి మహాతీర్థవారి బుధవారం నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొనే విధంగా 12వ తేదీ తంజావూరు జిల్లా కలెక్టర్ ప్రియాంక పంకజం స్థానిక సెలవు ప్రకటించారు. ఈ సెలవు రోజు భర్తీచేసేలా ఈనెల 29వ తేదీ శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు పనిచేస్తాయని కలెక్టర్ ఆదేశించారు.


మెరీనాబీచ్ మద్రాసు వర్సిటీ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ షెడ్

ట్రాఫిక్స్ సిగ్నళ్ల వద్ద గ్రీన్ నెట్లు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు నగరంలో ప్రధాన రహదారుల్లో సిగ్నల్స్ వద్ద వాహన చోధకులకు ఎండవేడి నుండి కాపాడేలా గ్రీన్‌షెడ్ ఏర్పాటు చేశారు. తొలి విడతగా అన్నాసాలై, పూందమల్లి హైరోడ్డు, అన్నానగర్, అడయార్, వేప్పేరి, రాయపేట సహా 14 చోట్ల నీడనిచ్చే పందిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పందిళ్లను ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద 6 మీటర్ల పొడవునా, 5 మీటర్ల ఎత్తున నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


అతిథులతో పురస్కార గ్రహీతలు

13 మంది మహిళలకు పురస్కారాలు

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జియో ఇండియా ఫౌండేషన్' 'వావ్ వండర్ ఎమెన్ అవార్డ్స్' పేరుతో 13 మంది మహిళా ప్రముఖులను సత్కరించింది. ఐపీఎస్ అధికారి డాక్టర్ ఎంసీ సారంగన్, నటి ఇనియా, యాస్మీన్ జవహర్ అలీ, శారద రమణి తదితరులు ప్రత్యేక అతిథులుగా హాజరై వివిధ రంగాల్లో కృషి చేసిన మహిళలను పురస్కారాలు ప్రదానం చేశారు. జియో ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ప్రియా జెమీమా ఈ సందర్భంగా పదిమంది గిరిజన మహిళలకు టైలరింగ్ మెషీన్లను విరాళంగా అందించారు.

ఉత్సాహంగా ఉగాది పోటీలు



పోటీల వివరాలను వెల్లడిస్తున్న నిర్వాహకులు - తల్లిదండ్రులతో హాజరైన విద్యార్థులు

ప్యారీస్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తర మద్రాస్ ఉగాది మహోత్సవ కార్యనిర్వాహకవర్గం, సర్ త్యాగరాయ కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వవసు ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాత చాకలిపేటలోని దేవాంగ కన్నికలమ్మ దేవాలయ ప్రాంగణంలో పోతన భాగవతంలోని పద్యాలపై నిర్వహించిన పోటీల్లో నాలుగు నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మద్రాస్ ప్రిసీడియం మేయర్‌గా వ్యవహరించిన సర్ పిట్టి త్యాగరాయ శ్రేష్ఠి గురించి వక్తృత్వ పోటీలు నిర్వహించగా, ఎస్కేపీడీ, కేటీసీటీ, కేసరి, కార్పొరేషన్ పాఠశాలలకు చెందిన 255మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. చిత్రలేఖనం పోటీల్లో కూడా విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల న్యాయనిర్ణీతలుగా జీకే జగదీశ్వరయ్య, మునిరాజా మాచర్ల, నరసింహా, ములుగు షణ్ముగం, గోసు గజేంద్రబాబు, గుడిమెట్ల చెన్నయ్య, కోటేశ్వరరావు, సజ్జా ప్రభురామ్ వ్యవహరించారు. 15మంది విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేసి, అభినందించారు.

13 దేశాల్లో సింఫోనీ కచేరీలు

● తన విజయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

● ఇళయరాజా పిలుపు ● ఇసైజ్ఞానికి ఘన స్వాగతం


ఇళయరాజాకు స్వాగతం పలుకుతున్న మంత్రి తంగం తెన్నరసు తదితరులు

అడయార్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): త్వరలో సింఫోనీ కచేరిలు 13 దేశాల్లో నిర్వహిస్తామని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా వెల్లడించారు. ఆసియాలోనే సింఫోనీ స్వయంగా రాసి వేదికపై ప్రదర్శించిన తొలి స్వరకర్తగా రికార్డు సృష్టించిన ఇసైజ్ఞాని ఇళయరాజాకు చెన్నై విమానాశ్రయంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. లండన్‌లో తన సింఫోనీ కచేరి విజయవంతంగా ముగించుకుని సోమవారం చెన్నై తిరిగి రాగా, ఆయనకు ప్రభుత్వం తరపున రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు సహా కోలీవుడ్ ప్రముఖులు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తంగం తెన్నరసు మాట్లాడుతూ.. ఇళయరాజా తన చిరకాల కోరికను లండన్ వేదికగా నెరవేర్చి భారతదేశానికే కాదు ఆసియా ఖండానికే గర్వకారణంగా నిలిచారన్నారు. అలాంటి సంగీత మేధావికి రాష్ట్ర ప్రజల తరపున ఘన స్వాగతం పలకాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారని, అందుకే తాను ఎయిర్‌పోర్టుకు వచ్చి ఇళయరాజాను సగర్వంగా స్వాగతం పలుకుతున్నట్టు చెప్పారు. అనంతరం 'ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపిన ఇళయరాజా మీరంతా కలిసి సంతోషంగా లండన్‌కు పంపించారు. దేవుడి ఆశీస్సులతో నా తొలి సింఫోనీ ప్రదర్శన విజయవంతంగా ముగిసింది. నొటేషన్ ఎవరైనా రాయొచ్చని, అలా రాసిన దాన్ని ఎవరైనా పఠించవచ్చన్నారు. అలా చదివేటపుడు ఒక్కొక్కరు ఒక్కో విధంగా పఠిస్తే ఏమౌవుతుంది? అలా కాకుండా, కండక్టర్ మైఖేల్ టామ్సీ అద్భుతంగా సమన్వయం చేశారు. చెన్నై నుంచి లండన్ చేరుకున్న నేను ఒకే ఒక్కసారి రిహార్సల్ చేశాను. సింఫోనీ అరంగేట్రంలో నియమాలు ఎట్టిపరిస్థితుల్లోనూ మారకూడదు. వాటిని అనుసరిస్తూ 80 మంది సంగీత విద్వాంసులు ఒకేసారి మ్యూజిక్ కండక్టర్‌ను గమనించాలి. సింఫోనీలో మొత్తం నాలుగు భాగాలు ఉన్నాయి. ఆ నాలుగు భాగాలు ముగిసేంత వరకు శ్రోతలు కరతాళ ధ్వనులు చేయకూడదు. కానీ, ఒక్కో దశ పూర్తికాగానే వారి చప్పట్లతో ఆడిటోరియం మార్మోగిపోయింది. సింఫోనీ రెండో భాగంలో నేను స్వరపరిచిన పాటలను ప్లే చేశాను. ఒక పాట వారితో కలిసి పాడటాన్ని కూడా అభిమానులు ఎంతగానో ఆస్వాదించారు. ప్రభుత్వం తరపున స్వాగతం పలకడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నాపై మీరు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞుడిని. నన్ను సంగీత దేవుడుగా మీరు పిలుస్తుంటారు. కానీ, నేను ఒక సాధారణ మనిషిని. ఇసై కడవుల్‌గా మీరు పిలిచినపుడల్లా... దేవుడిని ఇళయరాజాగా ఎందుకు తగ్గించారు అని నేను ఆశ్చర్యపోతుంటాను. ఈ సింఫోనీ ప్రదర్శన కేవలం ప్రారంభం మాత్రమే. 82 యేళ్ళు గడిచిపోయాయి. ఇపుడేంటి ఆరంభం అని మీరు భావించొద్దు. మీరు ఊహించుకున్నట్టుగా నేను లేను. పన్నాపురం నుంచి కాళ్ళకు చెప్పులు లేకుండా ఇక్కడకు వచ్చాను. ఇపుడు సింఫోనీ సంగీతం సమకూర్చాను. వీలైతే యువకులు నన్ను ఆదర్శంగా తీసుకుని, వారివారి శాఖల్లో రాణించి దేశానికి మేలు చేయాలి. ఇదే వారికిచ్చే నేనిచ్చే సలహా' అని ఇళయరాజా అన్నారు. ఈ కార్యక్రమంలో కోలీవుడ్ దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు, కోలీవుడ్ మ్యూజీషియన్స్ అధ్యక్షుడు దీనా, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బామ్మ శతవార్షికోత్సవం


సరస్వతమ్మ వందేళ్ళ పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

ప్యారీస్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక షావుకారుపేట నాట్టుపిళ్లయార్ కోవెల వీధికి చెందిన రాచపూడి సరస్వతమ్మ వందేళ్ళ పుట్టినరోజు వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దివంగత రాచపూడి వెంకట కృష్ణయ్య చెట్టి సతీమణి రాచపూడి సరస్వతమ్మ ఆదివారం వందో సంవత్సరంలోకి అడుగుపెట్టారు. ఇది అరుదైనదిగా భావించిన కుటుంబ సభ్యులు ఆమె పుట్టినరోజును పండుగలా జరుపుకున్నారు. ఆమె నలుగురు కుమారుల్లో ఇద్దరు మృతిచెందగా, శ్రీహరి, అమర్‌నాథ్ సహా శ్రీరంగాలు అనే కుమార్తె, అల్లుడు, కోడళ్ళు, మనవళ్లు, మునివనవళ్ళతో కలిసి 50మందికి పైగా ఒకేచోట చేరడంతో హర్షం వ్యక్తంచేశారు. పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న బంధువులు, మిత్రులు, పుర ప్రముఖులు సరస్వతమ్మకు బహుమతులు అందజేసి, ఆమె దగ్గర ఆశీస్సులందుకున్నారు.

'వాస్'తో స్పెల్‌బీ ప్రచార భాగస్వామ్యం


భాగస్వామ్యం వివరాలను తెలుపుతున్న డాక్టర్ గేరీ జాకోబ్స్, దేవకన్ని సుబ్రమణియన్

చెన్నై, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మానవాళి సంరక్షణ దిశగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే వరల్డ్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (వాస్) విశిష్టతలపై ప్రచార బాధ్యతలను స్పెల్‌బీ ఇంటర్నేషనల్ చేపట్టింది. ఈ మేరకు నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో రెండు సంస్థలు వప్పందం కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో వాస్ సీఈఓ డాక్టర్ గేరీ జాకోబ్స్, స్పెల్‌బీ ఇంటర్నేషనల్ సీఈఓ దేవకన్ని సుబ్రమణియన్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన పాంబన్ కొత్త వంతెన


పాంబన్ కొత్త రైలు వంతెన

ప్యారీస్, మార్చి10 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలోని పాంబన్ వద్ద సముద్రంపై కొత్తగా రూ.545 కోట్లతో నిర్మించిన రైలు వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. ఆంగ్లేయుల కాలంలో రైళ్ల రాకపోకల కోసం సముద్రంపై నిర్మించిన పాంబన్ వంతెనకు 110ఏళ్ళు పూర్తి కావడంతో ఆ వంతెన సమీపంలోనే సుమారు 75మీటర్ల పొడవున ఆటోమాటిక్ వంతెన పడవలు వెళ్ళేందుకు అనుకూలంగా దక్షిణ రైల్వేశాఖ నిర్మించింది. ఉప్పుగాలి వల్ల ఈ వంతెన చెక్కుచెదరకుండా అల్యూమినియం మిశ్రమం పెయింటింగ్ పనులు కూడా శనివారానికి పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో, ఈ కొత్త వంతెనను ప్రధాని నరేంద్ర మోది ప్రారంభించనున్న సందర్భంగా ఇప్పటివరకు మూడు దశలుగా ఈ వంతెనపై ట్రయల్‌రన్ విజయవంతంగా పూర్తిచేశారు. ఇదిలా వుండగా పాంబన్ కొత్త రైలు వంతెన త్వరలోనే ప్రారంభించాలని జిల్లా వాసులతో పాటు పర్యాటకులు రైల్వేశాఖను కోరుతున్నారు.

జార్జిటౌన్‌లో రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు పి.మూర్తి, పీకే శేఖర్‌బాబు

ప్యారీస్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జ్‌టౌన్‌లో రూ.9.85 కోట్లతో నూతనంగా నిర్మించిన రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రాష్ట్ర మంత్రులు పి.మూర్తి, పీకే శేఖర్‌బాబు సోమవారం ప్రారంభించారు. మద్రాస్ హైకోర్టు సమీపంలోవున్న రాజాజీ రోడ్డులో అప్పటి బ్రిటిష్ పాలకులు 1864వ సంవత్సరంలో మద్రాస్ టెర్రర్స్ రూఫ్, మ్యాంగలూర్ టైల్ రూఫ్, టేకు కొయ్యలతో గోతిక్ ఆర్ట్ కళానైపుణ్యంతో నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరుకుంది. అందువల్ల రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఆ పురాతన భవనాన్ని కూల్చివేసి కొత్త భవనాన్ని రిజిస్ట్రార్ కార్యాలయం కోసం రూ.9.85 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మించారు. సోమవారం రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖామంత్రి పి.మూర్తి, హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాణిజ్య పన్నులు, రిజిస్ట్రార్ శాఖల అదనపు కార్యదర్శి కుమార్ జయంత్, రిజిస్ట్రేషన్ శాఖ చైర్మెన్ దినేష్ పొన్‌రాజ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



బాలాజీనగర్‌లో ఆరడుగుల నాగుపాము

తిరుమల, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల బాలాజీనగర్‌లోని ఓ ఇంట్లోకి ప్రవేశించిన నాగుపామును సోమవారం భాస్కర్ నాయుడు పట్టుకున్నారు. ఆరు అడుగుల పొడవున్న ఆ పామును అడవిలో వదిలి పెట్టారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



మంత్రి నారాయణ - కోనా రఘుపతి - తీరకైత్ జేరియస్నెట్టసిన్ - ఎం రామరాజు

తిరుమల, మార్చి10 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర మంత్రి నారాయణ, ఏపీఐఐసీ చైర్మన్ ఎం రామరాజు, కోనా రఘుపతి, థాయ్-భారత్ కల్చరల్ లాడ్జ్ చైర్మన్, థాయిలాండ్ మాజీ మంత్రి తీరకైత్ జేరియస్నెట్టసిన్ ఉన్నారు.

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.05 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,478

తలనీలాలు సమర్పించినవారు: 26,667



పాటను మిగిల్చి వెళ్లిపోయావా...!

కన్నీరు మున్నీరవుతున్న గరిమెళ్ల శిష్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అక్షరానికి రాగం నేర్పినవాడు. సంగీతాన్ని సరళం చేసి అందరికీ అందించినవాడు. గాయకుడు, కవి, సంగీత స్రష్ట అయిన గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ హఠాన్మరణం ఆయన అభిమానులను దిగ్భ్రాంతి పరచగా, శిష్యులను దుఃఖంలో ముంచెత్తుతోంది. ఆయనతో కలిసి పాడినవారు, ఆయన కచేరీలకు వాయిద్య సహకారం అందించినవారు, ఆయన తీర్చిదిద్దిన సంగీత కళాకారులు ఎందరో గాజు పెట్టెలో నిశ్శబ్దంగా నిశ్చలంగా ఉన్న గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ భౌతిక కాయాన్ని సందర్శించి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆయనతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.



వైకుంఠంలోనూ అన్నమయ్య కీర్తన



ఆయనంటేనే సంగీతం. అన్నమయ్య పాట- బాలకృష్ణుని నోట అన్నట్టుగా వారి సంకీర్తనా యజ్ఞం సాగింది. నేదునూరి, పినాకపాణి, రాళ్లపల్లె, శ్రీనివాస రావు, మల్లిక్ స్వరపరిచిన కీర్తనలను కూడా ప్రాచుర్యంలోకి తెచ్చారు. అపర అన్నమయ్యగా పేరొందిన గరిమెళ్ల సంగీతాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ 47 ఏళ్లుగా విన్నారు. ఇంతకంటే గరిమెళ్లకు భాగ్యం ఏం కావాలి. వైకుంఠంలోని శ్రీమన్నారాయణుడి చెంత అన్నమయ్య కీర్తనలు వినిపించడానికి వెళుతున్నారని అనిపిస్తూ ఉంది. నా వంటి శిష్యులు ఒక్క కన్నీటి చుక్క తప్ప ఏమిచ్చి రుణం తీర్చుకోగలం.

- చిన్నమదేవి, శిష్యురాలు

అక్షరాన్ని రాగయుక్తంగా పలకడం నేర్పారు



మొదటిసారి టీటీడీ తెచ్చిన 'వెంకటాద్రి వెన్నెల' అనే క్యాసెట్‌లో గరిమెళ్ల వారి గొంతు విన్నాను. ఈ తర్వాత వెన్నెలలో ఆ గొంతు నన్ను వెంటాడింది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారు నిర్వహించే సంకీర్తన స్కాలర్‌షిప్ కోర్సులో 1999-2001 మధ్య వారి దగ్గర అన్నమాచార్య సంకీర్తనలు నేర్చుకునే అదృష్టం దక్కింది. ఇలా వారితో అనుబంధం ఏర్పడింది. నేదునూరి, మంగళంపల్లె ఇద్దరి సంగీతంలోని లాలిత్యం గరిమెళ్ల స్వరం. గణపతి, ఆంజనేయ, నవగ్రహ సంకీర్తనలు రాసి పాడారు. అయితే, ఒక అక్షరాన్ని ఎలా రాగయుక్తంగా పలకాలో వారి నుంచీ నేర్చుకున్నాను. జీవితంలో మరువలేని సంగీత గురువు గరిమెళ్ల.

- కె.సరస్వతి ప్రసాద్, గాయకుడు

ఆయన బాణీలకు వాద్య సహకారం గొప్ప జ్ఞాపకం



నా చిన్నప్పటి నుంచీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌తో మా కుటుంబానికి మంచి అనుబంధం ఉంది. వారి అనేక సంగీత కచేరీలకు మృదంగ వాద్య సహకారం అందించాను. గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ రూపొందించిన కొత్త బాణీలకు వాద్య సహకారం అందించడం గొప్ప జ్ఞాపకం. స్వతహాగా గరిమెళ్ల మృదంగ విద్వాంసులు కావడంతో వారి స్వర రచన కూడా చాలా గమ్మత్తుగా ఉంటుంది. వారి సంగీత కచేరీలకు మృదంగ వాద్య సహకారం అందించడం అదృష్టంగా భావిస్తున్నాను.

- పారుపల్లె బాలసుబ్రమణ్యం, ఆకాశవాణి ఏ- గ్రేడ్ మృదంగ విద్వాంసుడు

గాయనిగా తీర్చిదిద్దిన అన్న



ముప్పై కొత్త రాగాలను సృష్టించారు. గరిమెళ్ల చేసిన ఈ సంగీత కృషికి వెల కట్టలేం. శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు పాడిన కీర్తనలను, నవగ్రహ కీర్తనలను అందరూ పాడుకునే విధంగా సరళం చేసి పాడారు. పాతికేళ్ల వయసులోనే సంగీత, సాహిత్యంతో కూడిన పుస్తకం రాశారు. వెంకయ్య స్వామి, దత్తాత్రేయ, ఆంజనేయస్వామి, వేంకటేశ్వరస్వామి వారిపై సంకీర్తనలు కొత్తగా రాశారు. వారితో నాకు 46 ఏళ్ల పరిచయం. వారి చెల్లెలు వారి దగ్గర లేదు. మా అన్న నా దగ్గర లేరు. ఇందువల్ల ఇద్దరం అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని పంచుకున్నాం. సంగీతంలోని మెలకువలు నేర్పి నన్ను గాయనిగా తీర్చిదిద్దారు.

- ఎన్‌సీ శ్రీదేవి, ప్రముఖ గాయని

దూరవిద్యా పరీక్షలు వెంటనే నిర్వహించండి

● ఎస్వీయూ అధికారులకు హైకోర్టు ఆదేశం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ దూరవిద్యా పరీక్షలను వెంటనే నిర్వహించాలని ఆ వర్సిటీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. 2021వ సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులకు 2024 లోపు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే, యూనివర్సిటీ నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకూ పరీక్షలు నిర్వహించలేదు. ఈ ఏడాది జనవరి 2 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఆ తర్వాత ఎలాంటి కారణం లేకుండా పరీక్షలను వాయిదా వేశారు. అనంతరం ఫిబ్రవరి 3 నుంచీ పరీక్షలు నిర్వహిస్తామని హాల్‌టికెట్లు కూడా జారీ చేసినా.. మళ్లీ వాయిదా వేశారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 24 నుంచి రాష్ట్రంలోని 46 ప్రభుత్వ గుర్తింపుగల కాలేజీల్లో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా మూడోసారి పరీక్షలను వాయిదా వేశారు. దీనిపై దూరవిద్యా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో మార్చి 17 నుంచీ పరీక్షలు నిర్వహించాలని గత వారం హైకోర్టు తీర్పునిచ్చింది. అయినప్పటికీ 10వ తరగతి పరీక్షల కారణంగా ఈ నెల 17 నుంచి పరీక్షలు నిర్వహించలేమని నాలుగోసారి దూరవిద్యా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో 10వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 2 నాటికి ముగియనున్నారు. దీంతో ఏప్రిల్ 2వ తేది తర్వాత 46 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను తప్పనిసరిగా నిర్వహించాలని ఎస్వీయూ ఉన్నతాధికారులను హైకోర్టు ఆదేశించింది.

ఇప్పటికైనా పరీక్షలు జరిగేనా?

ఎస్వీయూ దూరవిద్యా విభాగంలో గతేడాదిగా పరీక్షలు పదే పదే వాయిదా పడుతున్నాయి. ఈ పరీక్షల కోసం సుమారు 32 వేల మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నట్టు అంచనా. ఈ పరీక్షలకు ఇప్పటికే రూ.8 కోట్ల వరకూ ఫీజుల రూపంలో యూనివర్సిటీకి అందినట్టు తెలుస్తోంది. గతేడాది మార్చిలో పరీక్షా ఫీజు చెల్లించినా ఇంకా పరీక్షలు నిర్వహించకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ విలువైన కాలాన్ని కోల్పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పరీక్షలను నిర్వహించాలని కోరుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికైనా ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు జరిగేనా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

అత్త హత్య కేసులో అల్లుడి అరెస్టు



నిందితుడ్ని అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వివిధ వ్యసనాలతో బాధపడుతూ డబ్బుకోసం అత్తను హత్య చేసిన రవీంద్ర నాయక్‌ను తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీలత తెలిపిన ప్రకారం.. నగరంలోని చిన్నగుంటలో కాపురమున్న గోపాల్‌రెడ్డి భార్య ప్రమీల పాచి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ నెల ఏడో తేది మధ్యాహ్నం ఇంట్లో ఉన్న సమయంలో ఆమె అల్లుడు రవీంద్ర నాయక్ డబ్బులు కావాలని డిమాండు చేశాడు. తనవద్ద లేదని ఆమె చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆగ్రహించిన అతడు ఆమె చేతులు కట్టి, కాళ్ళతో తన్ని, చేతులతో గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడి కోసం సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో రెండు బృందాలు తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో గాలించారు. తిరుపతిలోని వేదిక్ వర్సిటీ వద్ద నిందితుడు ఉన్నట్లు అతడి మొబైల్ నెట్ వర్కు ఆధారంగా సోమవారం పోలీసులు గుర్తించి వెళ్లారు. పోలీసులను చూసిన నిందితుడు పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. ఎవరైనా నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ మురళీమోహన్‌తో పాటు ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరత్నం, హెడ్ కానిస్టేబుల్ రాము, కానిస్టేబుళ్ళు రమేష్, తిలక్ కుమార్‌లను డీఎస్పీ శ్రీలత అభినందించారు.



ఎన్‌హెచ్‌పై ధాన్యం ట్రాక్టర్ బోల్తా

● 3 గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం

తడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తడ మండలం కొండూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ధాన్యం బస్తాలు రోడ్డంతా పడిపోవడంతో దాదాపు 3 గంటల పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాక్టర్ బోల్తా పడిన వెంటనే డ్రైవర్ పరారైనట్లు స్థానికులు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్, ధాన్యం బస్తాలను తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యల్లో భూవివాదాలే ఎక్కువ



ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలంటూ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం, వరి కంకిలను అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీల్లో భూవివాదాలే ఎక్కువగా ఉన్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రజలు 265 సమస్యలపై ఇచ్చారు. వీటిలో 172 భూవివాదాలవే కావడం సమస్య తీవ్రతకు నిదర్శనం. కాగా, పీజీఆర్ఎస్ ద్వారా అందే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, డీఆర్డీఏ పీడీ శోభన్‌బాబు వినతులు స్వీకరించారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టండి

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా కృష్ణమనాయుడు, పలువురు రైతుల కోరారు. ఎంఎస్పీ రకం ధర రూ.19,720 ఉండగా రూ.17వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. రైతుల పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం వెంటనే ఎంఎస్పీ వరిధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేయాలని కోరారు. ఎకరాకు ఇస్తున్న గోనెసంచుల సంఖ్యను 75కు పెంచాలని కోరారు.

ఓటేరు చెరువును పరిరక్షించండి

ఓటేరుచెరువువద్ద కబ్జాదారులు అక్రమంగా తోలిన ఎర్రమట్టిని తక్షణమే తొలగించేలా చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అంజయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జయచంద్ర కోరారు. ఆయన కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీకాళహస్తికిచెందిన కొందరు చెరువును కబ్జాచేశారని, వారిని తక్షణమే నిలువరించాలన్నారు. భూకబ్జాదారులకు ఆ భూమిని అప్పగిస్తే పేదలను సమీకరించి ఆచెరువులో ఎర్రజెండాలు పాతి నిరుపేదలకు ఇంటి స్థలాలుగా పంచుతామన్నారు.సీపీఐ నేతలుచిన్నం పెంచలయ్య, విశ్వనాథ్, పద్మనాభరెడ్డి, గోపాల్‌రెడ్డి,నదియా,రత్నమ్మ, విజయ పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

మామిడికి గిట్టుబాటు ధర లభించేలా చూడాలని అఖిల భారత రైతు సంఘాల సమాఖ్య నేత మాంగాటి గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరావు, శేఖర్‌రాజు తదితరులు కోరారు. ఈసారి దిగుబడి అధికంగా ఉందని పసిగట్టిన మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు కొత్త ఎత్తులు వేస్తున్నారన్నారు. మామిడిగుజ్జుకు విదేశాల్లో గిరాకీ లేదని, ఈ సంవత్సరం మామిడికాయలను కొనలేమంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తోతాపూరికి గిట్టుబాటు ధర కల్పించాలని, టేబుల్ వెరైటీని విదేశాలకు ఎగుమతిచేసి ఆదుకోవాలన్నారు.

స్వర్ణముఖి నదీ తీర ప్రాంతం పరిరక్షించండి

స్వర్ణముఖి నదీ తీర ప్రాంతాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని కలెక్టర్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు ఆందోళన వ్యక్తంచేశారు. నదీ తీరంలో అక్రమంగా గుడిసెలు వేసి కరెంటు కనెక్షన్ తీసుకుని చివరికి పంచాయతీల్లో ఇంటి పన్ను చెల్లిస్తూ నిర్మాణా లు చేపడుతున్నారన్నారు. వీరికి సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఒంటికాలితో ఇబ్బంది పడుతున్నా



'షుగర్ కారణంగా నా ఎడమ కాలు తొలగించారు. కూలీకి వెళితే కానీ కుటుంబం గడవని పరిస్థితి. మూడేళ్లుగా పింఛను కోసం ఒక కాలితోనే కుంటుకుంటూ కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా. పింఛను ఇప్పించి కుటుంబాన్ని ఆదుకోండి' అంటూ తిరుపతి అర్బన్ చింతలచేనుకు చెందిన మంగమ్మ అధికారులను అభ్యర్థించారు.

పేరూరు సప్లై చానల్‌ను పునరుద్ధరించండి

తుమ్మలగుంట చెరువుకు పోయే పేరూరు సప్లై చానల్‌ను కొంతమంది ఆక్రమించారని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ సప్లై చానల్స్‌ను పునరుద్ధరించాలని కోరారు. సాయినగర్ పంచాయతీలో నడుస్తున్న మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలని ఏపీ మహిళ సమైక్య కార్యదర్శి నదియా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

'వేదము' వెబ్‌సైట్ ప్రారంభం



ప్రసంగిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానాన్ని సాంకేతీకరించాల్సిన అవసరం ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పది రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌తో పాటు 'వేదము.ఓఆర్జీ' వెబ్‌సైట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. వెబ్‌సైట్ ద్వారా వేద విజ్ఞాన వ్యాప్తికి అవకాశం కలుగుతుందన్నారు. సత్యసాయి వేద సంస్థ ప్రతినిధి పరమహంసులు, మాజీ రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ రజనీకాంత్‌శుక్లా, అద్వైత వేదాంత విభాగ హెడ్ గణపతిభట్, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.